# జాతీయపతాకం గీతం

రచన :

రావినూతల శ్రీరాములు

784.7 1954
SRI

V. R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D. P. R. I.
Acc. No.

CT

Dr. B. R. AMBEDKAR
OPEN UNIVERSITY
LIBRARY
HYDERABAD-500 033

# జాతీయపతాకం గీతం

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N10896

రావినూతల శ్రీరాములు

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA D.P.R.I.
Acc. No. 10896

రాయల కళాపరిషత్
6/561 A, రామ్‌నగరు – అనంతపురం.

వెల రూ. 2.50

784 SR 71954

# ముందుమాట

Sri M. V. Rajgopal, M A., (Cantab)
I. A. S. (Retd.)
Former Vice-Chancellor,
J. N. T. University.

మన జాతీయ పతాకం – జాతీయ గీతాలపై ఈ చిరు పొత్తం రచించిన శ్రీ రావినూతల శ్రీరాములు సమర్థుడైన రచయితగా నాకు చిరపరిచితుడు.

ఆంధ్రకేసరి ప్రకాశం 25 వ వర్ధంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఆవిష్కరించిన వీరి పుస్తకం "ప్రజల మనిషి ప్రకాశం" చదివే అవకాశం నాకు కల్గింది.

సాధారణ ప్రజానీకానికి ఉపయుక్తమయ్యే అంశాలను గూర్చి వివిధ వర్గాలవారికి అర్థమయ్యేరీతిలో ఆసక్తికరంగా చెప్పగల శైలి శ్రీరాములు పుణికి పుచ్చుకొన్నారు.

ఈ రచన – భారత జాతీయ పతాకం, జాతీయ గీతం (జనగణమన) జాతీయ గేయం (వందేమాతరం) – వీటి చరిత్ర, ప్రాముఖ్యాలను వివరిస్తున్నది. ఈ సందర్భంలో ఇక్బాల్‌కవి రచించిన అందమైన గేయం 'సారే జహాఁసే అచ్ఛా' కూడా ఉదహరించారు రచయిత.

ముందు భారత జాతీయ కాంగ్రెసు పార్టీ జెండాగా 1947 లో స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత జాతీయజెండాగా పతాక చరిత్రను కొద్ది పుటలలో వివరించడంలో రచయిత కృతకృత్యులైనారు.

A0UA102B122

పతాకం యొక్క జాతీయ అంతర్జాతీయ ప్రాముఖ్యం వివిధ సందర్భాలలో దానిని గౌరవించాల్సిన విధానం కూడా తెలిపారు.

1921 లో విజయవాడలో ముందుగా ఈ పతాకాన్ని శ్రీ పింగళి వెంకయ్య ఎలా రూపొందించిందీ. దానినే గాంధీజీ ఆమోదించిన విషయం — దీనిలో వివరించారు.

అదేమాదిరి జాతీయ గీతం (జనగణమన) జాతీయ గేయం (వందేమాతరం) — వీటి చరిత్ర. ప్రాముఖ్యాలను మరింత క్లుప్తంగా తతిమ్మా పుటలలో తెలియ జెప్పారు.

అనేక వివరాలతో ప్రయోజనకరమైన సమాచారాన్ని అందించే ఈ రచన ప్రజల మెప్పు పొందగలదనడంలో నా కెలాంటి సందేహం లేదు.

రాష్ట్రంలోని విద్యాసంస్థలు, వయోజన విద్యాకేంద్రాలు గ్రంథాలయాలకు ఉపయోగ పడే ఈ చిరుపొత్తాన్ని నేను మిక్కిలి ప్రశంశిస్తున్నాను.

(సం) యం. వి. రాజగోపాల్
I. A. S. (రిటైర్డు)
జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక
విశ్వవిద్యాలయ మాజీ ఉపాధ్యక్షులు.

హైదరాబాదు
23-6-1981

# అంకితం


దక్షిణాది రాష్ట్రాలలో

తెలుగుభాషా సాహిత్యాల వ్యాప్తికి

కంకణం కట్టుకున్న మహా మనీషి

శ్రీ కె. యస్. కోదండరామయ్యగారికి

— రా. శ్రీరాములు



రచయిత: శ్రీ ఆర్. శ్రీరాములు

కృతిస్వీకర్త: శ్రీ కె. యస్. కోదండరామయ్య

6

# జాతి అంటే...

✻

జాతి అంటే ఫలానా అని ఖచ్చితంగా చెప్పడం కష్టం.

ఒకే రక్తం కలిగిన వాండ్లందరూ ఒక జాతి అందాము అంటే ఏగుంపు వాండ్లకూ ఒకే రకమైన రక్తం ఉండదు.

ఒక మతం వాళ్ళంతా ఒక జాతి అనడానికి వీల్లేదు. ఒక పరిమిత భూభాగంలో వుండే వారినే ఒక జాతిగా గుర్తిస్తాం.

మతం అట్లాకాదే మరి? అది అనేక దేశాలలో వ్యాపించి వుండవచ్చుకదా!

భాషనుబట్టి కూడా జాతి నిర్ణయం కుదరటం లేదు.

ఇంగ్లాండు ప్రజలు. అమెరికా ప్రజలు మాట్లాడే భాష ఒకటే — అదే ఇంగ్లీషు.

ఇంగ్లీషు అమెరికా దేశాలవారు వేరేవేరే జాతుల కిందనే లెక్క.

ఒకే చోట నివసిస్తూ ఒకే రకమైన కష్టసుఖాలు అనుభవిస్తూ వుండే వాండ్లకు 'మనమంతా ఒకటే.' అనే భావం ఏర్పడుతుంది. అది చాలా సహజంగా కూడా వుంటుంది.

దీనినే 'జాతీయత' అంటారు. భారతీయులందరూ ఒకే జాతి.

వీరికి కొన్ని తేడాలుండొచ్చు. కానీ, పైదేశాలకు పోయినప్పుడు వీళ్లంతా ఒక్కటిగా వుంటారు.

భారతీయ క్రైస్తవుడు ఏ దేశం వెళ్ళినా భారతీయుడే అవుతున్నాడు.

అలాగే భారతీయ ముస్లింను టర్కీ, అరేబియా, ఇరాక్ వెళ్లినా భారతీయుడే అంటారు.

ఏదో ఒక రాజ్యానికి చెంది వుండడాన్ని జాతీయత అంటారు. రాజ్యంలో వున్నవారందరినీ ఆ దేశపు జాతీయులు అంటారు.

జాతీయ భావంలోనే దేశాన్ని ప్రేమించడం ఇమిడి వుంది. దేశభక్తి అంటే అదే.

జాతిని శక్తి కలదానిని చేయడంలోనూ, వ్యక్తి దేశానికి విధేయుడుగా వుండటంలోనూ ఇది తోడ్పడుతుంది.

నెహూర్రు పండితుడు ఏమన్నాడంటే; "జాతీయభావం చాలా లోతైనదీ, బలమైనదీ, అది గతకాలంనాటికి చెంది నదై రానున్న కాలానికి పనికిరాకపోయేది కాదు."

# జెండా జాతికి జీవగఱ్ఱ

అనాది నుండి ప్రతిజాతికీ ఒక జెండా వుంది.

అర్జునుడి జెండామీద కోతిబొమ్మ వుండేది.

రాణాప్రతాపుడి జెండామీదా, శాతవాహనుల జెండా మీదా "సింహం" గుర్తు వుండేది.

శివాజీ జెండా కాషాయ రంగుది. దానిమీద భవాని అమ్మవారి చిత్రం వుండేది.

మన కాలంలో బ్రిటిష్‌వాండ్ల జెండా "యూనియన్ జాక్."

చారలూ, నక్షత్రము వున్న జెండా అమెరికా వాండ్లది.

ఎర్రరంగు జెండామీద సుత్తీ, కొడవలీ వున్న పతాకం రష్యాదేశానిది.

ప్రతిదేశం తన గత వైభవాలకు గుర్తుగా, ఆశయాలు, ఆదర్శాలకు అద్దంగా జాతీయ పతాకాలను ఏర్పరచుకొంటుంది.

అందుకే "పతాక మన ఆదర్శానికి ప్రతీక" అన్నారు గాంధీజీ.

నడిసముద్రం ఏ ఒక్కదేశం సొత్తూకాదు. అక్కడ ప్రయాణంచేసే ఓడలపై ఏ దేశం జెండావుంటే ఆ ప్రాంతం మీాద అధికారం ఆ దేశానిది.

అందుకే అలాంటి ఓడలను "ప్రయాణించే ద్వీపాలని" కూడా అంటారు.

యుద్ధసమయంలో పతాకం చేతిలోవున్న వీరుడు పడిపోతుంటే మరి ఒక వీరుడు అందుకొని పతాకం పడిపోకుండా చూస్తాడు.

"ఝుండా ఊంఛా రహే హమారా"

# మూడు రంగుల జెండా

❁

మనదేశంలో మొదటిసారిగా జాతీయ పతాకాన్ని కలకత్తా లోని గ్రీన్‌పార్కులో 1906 ఆగస్టు 7 వ తేదీన ఎగురవేశారు. దీనిలో ఎరుపు, పసుపు, ఆకుపచ్చ రంగుల అడ్డచారలు వున్నాయి.

ఎరుపు చారలమీద 8 తెల్లని పద్మాలూ, పసుపుచార మీద "వందేమాతరం" అని దేవనాగర లిపిలో అక్షరాలూ వున్నాయి.

ఆకుపచ్చ చారమీద సూర్యుడు, నెలవంక, చుక్క వున్నాయి.

మదాం కామా, ఆమె స్నేహితులు కొందరు విప్లవకారులు పారిస్ నగరంలో 1907 లో ఒక పతాకాన్ని ఎగురవేశారు. ఇదీ పైన చెప్పిన పతాకం మాదిరేవుంది. ఏదో కొద్దికొద్ది మార్పులు తప్ప.

1917 సం॥లో మరి ఒక పతాకం రూపొందించారు. దీనిలో ఏడు నక్షత్రాలు వున్నాయి.

1921 నుండి కాంగ్రెస్ సంస్థ గాంధీజీ నాయకత్వం క్రిందకి వచ్చింది.

ఆ సంవత్సరములోనే విజయవాడలో కాంగ్రెస్ సంఘ సమావేశమైనది.

తెలుగు యువకుడు పింగళి వెంకయ్యగారు ఆ సభలో పాల్గొన్నారు ఆయన పతాకాలను గూర్చి బాగా పరిశోధన చేసినారు.

1916 లోనే " భారతదేశానికి ఒక జాతీయ పతాకం " అనే పుస్తకం కూడా వ్రాశారు.

పింగళి వెంకయ్యగారు పుట్టింది కృష్ణాజిల్లా భట్లపెను మర్రులో. రైల్వేగార్డు మొదలుకొని అనేక ఉద్యోగాలు చేశారు సింహళం మున్నగు విదేశాల్లో పర్యటించారు కూడా.

వెంకయ్యగారు విజయవాడ సమావేశంలో గాంధీజీకి తాము తయారుచేసిన పతాకం నమూనా చూపారు.

దేశంలోవున్న రెండు ప్రధాన వర్గాలకూ ఎరుపు, ఆకు పచ్చ చారలు గుర్తులుంచి, ఇతర వర్గాలకు గుర్తు తెల్లనిచార. ఈ విధంగా మూడు రంగులతో పతాకం రూపొం దించారు వెంకయ్యగారు.

ఈ నమూనా గాంధీజీకి బాగా నచ్చింది. తెల్లచారమీద చరఖా చేర్చమన్నారు గాంధీజీ.

ఈ విధంగా మూడు రంగుల జెండా తయారు చేసిన కీర్తి తెలుగువారిదే!

తరువాత చాలాకాలానికి 1931 లో అఖిల భారత కాంగ్రెస్ సంఘం ఈ పతాకాన్ని ఆమోదించింది.

అయినా గాంధీజీ ఆమోదం పొందినందువల్ల అంతకు ముందు ప్రతి కాంగ్రెస్ సమావేశంలో మూడు రంగుల జెండానే ఎగుర వేసేవారు.

కుంకుమరంగు ధైర్యానికీ, త్యాగానికీ, తెలుపు శాంతి, సత్యాలకూ, ఆకుపచ్చ ఆత్మవిశ్వాసం, ఔదార్యానికీ గుర్తులు.

జాతీయ పతాకానికి పునాది అయిన మూడు రంగుల పతాకాన్ని రూపొందించిన పింగళి వెంకయ్యగారిని దేశప్రజ లందరూ చిరకాలం గుర్తించుకుంటారు.

గాంధీజీ యంగ్ ఇండియా పత్రికలో ఇలా వ్రాశారు. "మచిలీపట్నంలోని ఆంధ్ర జాతీయ కళాశాలకు చెందిన పింగళి వెంకయ్య ఇతర దేశ పతాకాలను గురించి వివరాలతో పాటు భారత జాతీయ పతాకం ఉండడానికి నమూనాలను సూచిస్తూ ఒక చిన్న పుస్తకాన్ని ప్రచురించి కొన్ని ఏండ్ల నుండి ప్రచారం సాగించినారు. గడచిన నాలుగు సంవత్సరాల నుంచీ ప్రతి కాంగ్రెస్ సభలో పట్టుదలగా జాతీయ జెండాను గురించి ఆయన చేసిన కృషిని నేను శ్లాఘించక తప్పదు." త్రివర్ణ పతాకాన్ని రూపకల్పన చేసింది వెంకయ్య కాగా జలంధర్‌కు చెందిన హంసరాజ్ అనే ఆయన రాట్నం వుండ దగినదని గాంధీజీకి సూచించారు.

# మదాం కామా

1907 లో విదేశాలలో మన పతాకాన్ని ఎగురవేసిన మదాం కామాను గూర్చి కొంచెం తెలుసుకుందాం.

ఈమె 1861 సెప్టెంబరు 24 న జన్మించింది. వీరిది జురాస్ట్రియన్ మతం. ఈమె తండ్రి సొరాబ్జీ ఫ్రాంజ్ పటేల్. తల్లి జిజీ.

భర్త రుస్తుం కామా "బొంబాయి క్రానికల్" పత్రికను నడిపేవాడు.

1901 లో వీరు ఇంగ్లాండు వెళ్ళారు. అక్కడ నుండి ప్యారిస్ చేరుకున్నారు. అక్కడనే స్థిరపడిపోయారు.

వీరసావర్కార్ మొదలయిన విప్లవ వీరులతో ఆమెకు పరిచయమయింది.

1905 లో "వందేమాతరం" పత్రిక పారిస్‌లో స్థాపించింది.

1907 ఆగస్టు 18 న జర్మనీలో సోషలిస్టు మహాసభ జరిగింది.

అన్ని దేశాల పతాకాలతోపాటు మన జాతీయ జెండాను ఎగురవేసింది.

మనదేశానికి స్వాతంత్ర్యం ఇవ్వాలని తీర్మానం కూడా సభవారిచే చేయించింది.

ఫ్రెంచి ప్రభుత్వం ఈమెను మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో అరెస్టు చేసింది.

లెనిన్ ఈమెను రష్యాదేశానికి ఆహ్వానించాడు.

1935 లో ఒకసారి ఈమె మనదేశానికి వచ్చింది. తరువాత కొంతకాలానికి మరణించింది.

వీరవనిత మదాం కామా భారత స్త్రీలకు గర్వకారణం.

# జెండా పోరాటాలు

మన ఆశయాలకూ, ఆదర్శాలకూ చిహ్నం మన జాతీయ జెండా. దీనిని చిన్నబుచ్చాలని పరాయి ప్రభుత్వం చాలసార్లు ప్రయత్నం చేసింది.

కానీ, వారి ప్రయత్నాలను ఉత్సాహంగల యువకులు ఎదిరించారు. ఈ పోరాటంలో కొందరు బలి అయినారు కూడా.

1923 లో నాగపూర్ లో జెండా సత్యాగ్రహం జరిగింది. దేశం అన్నిచోట్ల నుండి యువకులు అక్కడికి వెళ్లి జెండా గౌరవం కాపాడారు.

నాగపూర్ లో జాతీయ పతాక ఉత్సవం జరుగుతూ వున్నది. ఊరేగింపు పెద్దబజారులోనికి పోకూడదని నిషేధించారు. తమకు తమ ఇష్టము వచ్చిన చోటికి పతాకాన్ని తీసుకొనిపోయే హక్కు వుందని వాలంటీర్లు వాదించారు. అప్పుడు వాలంటీర్లను అరెస్టు చేశారు. అది ఒక ఉద్యమంగా మారింది.

జమన్‌లాల్ బజాజ్, పటేల్ సోదరులు దీనిని విజయవంతం చేశారు.

ఆనందంతో లాఠీదెబ్బలూ, జైలుశిక్షలు అనుభవించారు.

బందర్‌లో 'తోట నరసయ్య' అనే కుఱ్ఱవాడు మూడు రంగుల జెండా ఎగురవేయడానికి స్తంభం ఎక్కుతూ వుంటే పోలీసులు ఎముకలు విరిగేటట్లు లాఠీలతో కొట్టారు. కానీ పట్టుదలతో జెండా ఎగురవేసిన తరువాతనే అతడు స్తంభం దిగాడు. దెబ్బలకు సొమ్మసిల్లి పడిపోయాడు. ఆయనను "జెండావీరుడు నరసయ్య" అని పిలిచేవారు.

వరంగల్లులో మొగిలియ్య అనే యువకుడు ఎగురుతున్న జెండాను దించివేయడానికి ఒప్పుకోలేదు. నిజాం పాలకులు అతనిని ముక్కలు ముక్కలుగా చేసి చంపారు.

ఉత్తర ప్రదేశ్‌లో జెండా ఎగురవేయకుండా పోలీసులు కట్టుదిట్టం చేశారు.

చుట్టూ కాపలాయున్న పోలీసు వలయం కన్నుగప్పి ఆడవేషంలో ఒక వ్యక్తి అనుకున్న సమయానికి వచ్చి జెండా కట్టి చక్కా వెళ్లిపోయాడు.

ఆ వ్యక్తి ఎవరో కాదు. పూర్వం మనదేశ ప్రధాని అయిన లాల్ బహదూర్ శాస్త్రి!

# జనవరి 26 ప్రాముఖ్యం

1930 జనవరిలో కాంగ్రెస్ కార్యవర్గం సమావేశమై జనవరి 26 ను స్వతంత్ర్య దినంగా జరపాలని కోరింది.

అప్పటి నుండి ప్రజలు ప్రతి ఏటా జనవరి 26 నాడు జాతీయ పతాకం ఎగురవేస్తూ సభలు జరుపుతూ వచ్చారు.

1939 లో కొన్ని రాష్ట్రాలలో కాంగ్రెస్ అధికారం చేపట్టింది. అన్ని సర్కారు భవనాలమీద మన పతాకం ఎగురవేశారు.

1942 లో క్విట్ ఇండియా ఉద్యమంలో జెండా చేత పుచ్చుకొని. చాలామంది యువకులు అరెస్టు అయినారు.

నేతాజీ సుభాష్ చంద్రబోసు ఏర్పరచిన సైన్యం కూడా ఈ జెండా ముందు ఉంచుకొని పోరాడింది.

ఈ సైన్యంతోపాటు మన జెండా జర్మనీ, జపాన్ దేశాలలో కూడా ఎగిరింది.

# ధర్మ చక్రం

కాంగ్రెస్ జాతీయ సంస్థ నిలిపిన మూడు రంగుల పతాకంలో రాట్నంకు బదులు చక్రం ఏర్పరచారు.

సాధారణంగా పతాకంలో ఒకవైపు వున్న గుర్తు రెండో వైపు చూచినా అలాగే కన్పించాలి. 'రాట్నం' గుర్తు ఉంచి నట్లయితే ఇది వీలుపడదు. చక్రం అయితే రెండు వైపులా ఒకే మాదిరి కన్పిస్తుంది.

అశోకుని ధర్మపాలన ప్రపంచం అంతటా గుర్తింపు పొందింది. అందుచేత ధర్మచక్రం మన జెండాలో ఉండటం సమంజసం.

మన పూర్వ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్‌గారు ఇలా అన్నారు.

"చక్రం చలనానికి చిహ్నం. మనదేశం ముందుకు పోవాలి అన్న ఆశయం కూడా దీనివల్ల వెల్లడవుతుంది."

ధర్మచక్రంలో 24 ఆకులు వుండాలని నిర్ణయించారు. ఈ సంఖ్యకు విశేష ప్రాముఖ్యం వుంది.

రాజ్యాంగ సభలో ఈ పతాకాన్ని గూర్చి నెహ్రూ ఈ విధంగా ప్రసంగించారు.

"ఈ పతాకం ఇతర దేశాల మీదకి దండయాత్రికి పోదు. ఇది స్వతంత్ర్యానికి అసలైన గుర్తు. ఈ జెండా ద్వారా ప్రపంచంలోని ఇతర దేశాలకు మనం మిత్రులుగా వున్నట్లు చాటుతున్నాము. బానిసలుగా వున్న దేశాలకు అవి కూడా స్వతంత్రులు కావడానికి సహాయం చేస్తాము. ఇది మన జాతి గౌరవానికి చిహ్నం."

# జెండా నిబంధనలు

మనం ఎంతో పవిత్రంగా భావించే ఈ జెండాను గురించిన ముఖ్య నిబంధనలు తెలుసుకుందాం.

పతాక వందనానికి హాజరైన వారందరూ జెండాకు ఎదురుగా సావధానులై నిలబడి వందనం చేయాలి.

ఇతర జెండాలతో కలసి ప్రదర్శించవలసి వచ్చే ఎడల మన జెండాను అన్నిటికంటే కుడి భాగాన వుంచాలి.

ప్రముఖ వ్యక్తుల మృతికి గౌరవంగా పతాకాన్ని సగానికి దించాలి.

జెండా ఎక్కడ ఎగురవేసినా స్పష్టంగా కనిపించేటట్లు వుండాలి. దానిని అందరూ గౌరవ భావంతో చూడాలి.

ఏదో ప్రత్యేక సందర్భాలలో తప్ప. సాధారణంగా సూర్యుడు ఉదయించినప్పటి నుండీ అస్తమించే వరకు జెండా ఎగురుతుండాలి.

ఉత్సవ సమయాలలో జెండా పైకి ఎగురవేసేటప్పుడు వడివడిగానూ, క్రిందికి దించుతున్నప్పుడు నిదానంగానూ ఆ పనులు చేయాలి.

ఊరేగింపుగా వెళుతున్నప్పుడు ముందు భాగానికి కుడి వైపుగా జెండా వుంచాలి.

జెండా పొడవు వెడల్పులు మూడు రెండు నిష్పత్తిలో వుండాలి.

జెండాకు ఏడు రకాల కొలతలు ఉన్నాయి.

చాల పెద్దసైజు 6300×4200 మిల్లీమీటర్లు. అతి చిన్నసైజు 225×150 మిల్లీమీటర్లు.

ఈ చిన్నసైజు మోటారు వాహనాల మీద పెట్టుకోవడానికి వీలుగా వుంటుంది.

పాఠశాలలో ప్రమాణాలు తీసుకొనే సందర్భాలలో చేతులు కట్టుకొని అందరూ కలసి ప్రమాణం చేయాలి.

జాతీయ జెండా ఉపయోగానికి పనికి రాకుండా పోతే దానిని కాల్చివేయాలి. అంతే గానీ దానిని వేరే పనులకు వాడరాదు.

జాతీయ పతాకాన్ని గౌరవించడం పౌరుల బాధ్యత. ఇలాటి నిబంధన ఒకటి ఇటీవల మన రాజ్యాంగంలో చేర్చారు.

# జాతీయ గీతం

జాతీయ పతాకంలాగా జాతీయ గీతం కూడా ప్రధాన మైనదే.

ముఖ్యమైన కార్యక్రమాలలో జాతీయ పతాకాన్ని ఎగుర వేసిన వెంటనే జాతీయ గీతం పాడుతారు.

ప్రతి దేశానికీ జాతీయ పతాకంతోపాటు జాతీయ గీతం కూడా వుంటుంది.

"భగవంతుడు రాజును రక్షించాలి" (గాడ్ సేవ్ ది కింగ్) బ్రిటిష్‌వారి జాతీయ గీతం. ఇది వినడంతోనే ఆంగ్లే యులు ఉత్తేజితులౌతారు. ఫ్రాన్సు దేశంలో "లామోర్సెస్ లెయిసీ" అనేది జాతీయ గీతం.

# వందేమాతరం

మన జాతీయోద్యమంలో 'వందేమాతరం' గేయం ప్రముఖపాత్ర వహించింది.

హైదరాబాదు యువకుడు వావిలాల రామచంద్రరావు నైజాం రాష్ట్రంలో "వందేమాతరం" నినాదం ప్రారంభించారు. ఎన్నో బాధలకు గురి అయినాడు. ఆయన ఇంటిపేరు "వందేమాతరం"గా నిలిచిపోయింది.

"వందేమాతరం" పాట వ్రాసిన కవి బంకించంద్ర ఛటర్జీ. 1875 లో ఆయన కలకత్తా నుండి తన సొంత ఊరికి రైల్లో పోతూవున్నాడు. రైలుకిటికీ నుండి బైటికి చూస్తున్నాడు. నదులు, పూలు పండ్లతో నిండిన చెట్లూ, అడవులూ అందంగా కనిపించాయి. అతడు మనసులో భారతమాతను సందర్శించాడు.

వెంటనే భారతమాత ఎలా వున్నదో వర్ణిస్తూ ఆయన ఈ పాట వ్రాశారు.

"వందే మాతరం
సుజలాం, సుఫలాం
మలయజ శీతలాం
సస్య శ్యామలాం
మాతరం ......... వందే ....

17

శుభ్ర జ్యోత్స్నా  
పులకిత యామినీం  
సుహాసినీం  
సుమధుర భాషిణీం  
సుఖదాం వరదాం  
వందేమాతరం.

ఏ నోట విన్నా అదే. ప్రజల పాట అయిపోయింది. ఈ పాటను ప్రతి కాంగ్రెస్ మహాసభలో పాడుతుండేవారు.

1906 కాంగ్రెస్ మహాసభలో రవీంద్రనాథ ఠాగూర్ స్వయంగా ఈ పాట పాడారు.

బంకించంద్రుడు 'ఆనంద మఠం' అన్న నవల వ్రాశాడు. అంతకు పూర్వం నూరు సంవత్సరాల క్రితం బెంగాలులో జరిగిన సన్యాసుల తిరుగుబాటు ఆధారంగా అది వ్రాశాడు.

బంకిం సాహిత్యం ఒక గొప్ప వృక్షం. 'ఆనంద మఠం' దానిలో ఒక శాఖ. ఆ కొమ్మకు పూసిన పూవే 'వందేమాతరం గేయం.'

బంకిం బ్రిటిష్ ప్రభుత్వంలో మేజిస్ట్రేటు ఉద్యోగం చేశారు ఆయన తన పాటకు ఇంత పేరు వస్తుందని అనుకొని వుండడు.

బెంగాల్ విభజన సమయంలో 'వందేమాతరం' మంత్రంగా పనిచేసింది. ఈ గేయాన్ని శ్రీ అరవిందులు ఇంగ్లీషులోకి అనువదించారు.

అరవిందులు ఇంగ్లీషులోనూ, లాలాలజపతిరాయ్ ఉర్దూలోనూ కొంతకాలం 'వందేమాతరం' అనే పత్రికలు నడిపారు.

వందేమాతరం గేయంలో సంస్కృత పదాలు ఎక్కువగా వుండి వున్నాయి. ముస్లిం సోదరులకు అంతగా అవి అర్థమయ్యేవికావు. ఇది గమనించి ఇక్బాల్ మహాకవి రచించిన గీతం 1922 నుండి కాంగ్రెస్ సభలలో పాడుతూ వుండేవారు. దానిలో కొంత భాగం ఇది :

సారే జహాఁసే అచ్ఛా
హిందోస్తాన్ హమారా
హమ్ బుల్‌బులేఁ హైఁ ఇస్‌కీ
యహాఁ గులిస్తాన్ హమారా
మజహబ్ నహీఁ సిఖాతా
ఆపస్ మేఁ బైర్ రఖ్‌నా
హిందీహైఁ హమ్ వతన్‌హైఁ
హిందోస్తాన్ హమారా.

దీనినే చింతా దీక్షితులుగారు ఇలా తెలుగులో వ్రాశారు.

"ప్రపంచమందలి ప్రశస్త దేశం
భారతదేశం మనదేనోయ్
బుల్‌బుల్ పిట్టలమోయ్ మనమంతా
మనదేనోయ్ గులాబితోట
పరస్పరమ్మును వైరము పూనుట
మతమెన్నటికీ ప్రతిపాదించదు."

# జనగణమన

మన రాజ్యాంగం 1950 జనవరి 26న అమలులోకి వచ్చింది. అప్పుడు అధికార జాతీయ గీతం నిర్ణయించాల్సి వచ్చింది.

పెద్దపెద్ద ఉత్సవాలు జరిగినప్పుడు జాతీయ గీతం మిలిటరి బ్యాండుతో వాయిస్తూ వుంటారు. ఇతర దేశాలకు మన నాయకులు వెళ్లినప్పుడు కూడా ఇది బ్యాండుమీద మీటుతారు.

1947 లో ఒక సంఘటన జరిగింది. మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మొదటిసారిగా ఐక్యరాజ్య సమితి సమావేశంలో పాల్గొన్నది.

మీ " జాతీయగీతం " ఏమిటి అని మనవారిని అక్కడి వారు అడిగారు. మనవారి దగ్గర జనగణమన రికార్డు వున్నది. దానిని వెంటనే వినిపించారు.

వాయిద్యములమీద జనగణమన అక్కడివారి కెంతో నచ్చింది.

1912 లో రవీంద్రనాథ ఠాగూరు 'తత్త్వబోధిని' పత్రిక జనవరి సంచికలో 'జనగణమన' గీతం మొదటి సారిగా ప్రకటించారు.

ఠాగూరు మహాకవి రెండు వేలకుపైగా గీతాలు రచించాడు. ఆయన 'గీతాంజలి' కవితకు ప్రపంచంలో ఉత్తమమైన నోబెల్ బహుమతి వచ్చింది.

ఆయన దృష్టిలో మానవుడే దేవుడు. కాయకష్టంచేసే కార్మికునిలోనే ఆయన భగవంతుణ్ణి దర్శిస్తాడు.

రాజ్యాంగ సభలో నెహ్రూ పండితుడు ఇలా అన్నాడు. "వందేమాతరం మన స్వాతంత్ర్య పోరాటంతో సన్నిహిత సంబంధం కలిగివుంది. అది నిర్వివాదంగా మన ప్రధాన జాతీయ గీతం. ఆ స్థానం నుండి ఏ యితర గీతం దానిని తొలగించలేదు. జాతీయ గీతపు ప్రాముఖ్యం స్వదేశాలలోకంటే విదేశాలలోనే ఎక్కువ. ఒక జనగణమన ఫణితి విదేశాలలో గొప్ప మెప్పు పొందింది."

రాజెన్‌బాబు ఇలా అన్నాడు. "పదములూ, సంగీతమూ కలసిన 'జనగణమన' గీతం భారతదేశ జాతీయ గీతం. స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రధానపాత్ర వహించిన వందేమాతరం గేయం జనగణమన గీతంతో సమానంగా గౌరవించబడి సమాన గౌరవ ప్రతిపత్తి కలిగివుంటుంది."

# జాతీయ గీతం - కొన్ని సూచనలు

రవీంద్రనాథ ఠాగూరు రచించిన జనగణమనలో మొత్తం 31 చరణాలు ఉన్నాయి. అందులో ఈ క్రింది ఏడు చరణాలు మాత్రమే జాతీయ గీతంగా ఎన్నుకొన్నారు.

జనగణమన అధినాయక జయహే
భారత భాగ్య విధాతా !
పంజాబ, సింధు, గుజరాతు మరాఠా
ద్రావిడ, ఉత్కల, వంగా
వింధ్య, హిమాచల, యమునా గంగా
ఉచ్ఛల జలధి తరంగా
తవ శుభ నామే జాగే
తవ శుభ ఆశిష మాగే
గాహే తవ జయ గాధా
జనగణ మంగళ ధాయక జయహే !
భారత భాగ్య విధాతా
జయహే ! జయహే ! జయహే !
జయ జయ జయ జయహే !

ఈ గీతం పూర్తిగా రికార్డుపైన వినిపించడానికి 52 సెకండ్లు మాత్రమే పడుతుంది.

ఈ గీతాన్ని క్లుప్తంగా పాడే సందర్భాలు కూడా కొన్ని వుంటాయి. అప్పుడు

"జనగణమన అధినాయక జయహే !
భారత భాగ్య విధాతా !
జయహే ! జయహే ! జయహే !
జయ జయ జయ జయహే !"

అని పాడాలి.

ఇలా రికార్డుపై వినిపించడానికి ఇరవై సెకెండ్లు చాలు.

సాధారణంగా అతిథులకు విందుచేసే సమయాలలో ఈ గీతాన్ని క్లుప్తంగా పాడుతారు.

పాఠశాలలో దినసరి కార్యక్రమం జాతీయ గీతాన్ని ఆలాపించడంతో ప్రారంభమౌతుంది.

విద్యార్థులకు జాతీయ గీతం కంఠతా రావాలి. జాతీయ పతాకంపట్ల గౌరవభావం కల్గివుండాలి.

జాతీయ గీతం పాడేటప్పుడుగానీ, రికార్డు వేసినప్పుడు గానీ ప్రేక్షకులు సావధానంగా వుండాలి.

జాతీయ గీతంపట్ల నెహ్రూగారికి ఎంతో భక్తిశ్రద్ధలు వుండేవి. అందరికీ అలాంటి భావన కలగాలి.

ఎన్నో సభలలో తాను స్వయంగా నెహ్రూ దీనిని పాడే వారు. ప్రజలచేత పాడించి ఆనందించేవారు.

దీనిని అందరూ కలసి (కోరస్) గా పాడాలి.

అధికారికంగా నిర్ణయించిన స్వరంలోనే పాడడం ముఖ్యం.

నాందేడ్‌లో ఒక విద్యార్థి పాఠశాల లోపల ప్రవేశించే ముందుగా ఆతనికి జాతీయ గీతం వినిపించింది.

అతడు అక్కడే నిలిచిపోయాడు. జోరున వర్షం కురుస్తున్నా అతడు చలించలేదు.

ఈ విద్యార్థి భక్తిశ్రద్ధలకు జిల్లాకలెక్టరు మెచ్చుకొని యాభై ఒక్కరూపాయలు బహుమతిగా యిచ్చాడు.

జాతీయ పతాకంపట్ల గౌరవం చూపినట్లే జాతీయ గీతం పట్లకూడా శ్రద్ధ కనబరచడం మనవిధి.

—: జైహింద్ :—

BCE

A0UA102B|22

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.

BC

**మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక**

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | AOUA102B122 |
| పుస్తకం పేరు | జాతీయపతాకం గీతం |
| తారీఖు | 31 December 2025 |
| ముందు అట్ట | yes |
| వెనుక అట్ట | yes |
| మొత్తం పేజీలు | 37 |
| పెద్ద సైజు పేజీలు | No |
| ఖాళీ పేజీలు | CT, BC, 6 [illegible] |
| లేని పేజీలు | [illegible] |
| తయారు చేసినది | M. Ravi |
| పేజీలు విడదీసినది | M. Ravi |
| స్కాన్ చేసినది | [illegible] |
| పరీక్ష చేసినది | anusha |
| పేజీలు పరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | good |